# పచ్చ కామెర్లు

"నీ పేరు కృష్ణంరాజు అటగద" అడిగాడు అమర్ విసురుగా.

"అవునయ్యా" వినయంగా చెప్పాడు కృష్ణంరాజు.

"రాజు అంటె మీరే రాజులు?" చిరాకుగా అడిగాడు అమర్.

"మేం రాజులం కాదు సార్! మా నాయనకు హీరో కృష్ణంరాజు అంటే ఇష్టం. గందుకే ఆ పేరు పెట్టిండు నాకు"

"హో!...." నవ్వాడు అమర్.

"ఏమైనా చదువుకున్నావా?" అడిగాడు అమర్ కళ్ళు చికిలిస్తూ.

"ఇంటర్ ఫెయిలయిన. గింతల మా నాయన చచ్చిపోయిండు. డ్రైవింగు నేర్చుకుని డ్రైవర్ నౌకరీ చేస్తున్న"

అమర్ పక్కన కూర్చొని వున్న మహేశ్ రాజు వైపు చిరునవ్వుతో చూశాడు.

"మహేశ్! చూశావా - ఎట్లా మార్పు వస్తుందో ఇండియాలో. పేర్లను బట్టి ఎవడు ఏ కులంలో పుట్టాడో చెప్పలేము మునుపటిలాగా. ఈమధ్య ఊరికి పోయాన్నేను. అక్కడ డప్పు వాయించే ఒకతను న్యూయార్కు అని బొమ్మ వున్న టీ షర్టు వేసుకొని కన్పించాడు. వాళ్ళు ఎక్కడిదాకా చేరారో చూడు!" నవ్వాడు అమర్. మహేశ్ తల పంకిస్తూ చిరునవ్వు నవ్వాడు.

"వాళ్ళల్లో మార్పు వస్తున్నందుకు సంతోషించాలిరా. మేం కిందివాళ్ళం కాబట్టి మేం తక్కువ అనే భావన పోతున్నది. అమర్! నీకు గుర్తుందా - మనం విద్యార్థులుగా వున్నప్పుడు అదేగదా ఆశించాం. దీని కోసమేగద తపించాం. రక్తం ఉరకలు వేయగా వేడి వేడి మాటలు ఆవేశంగా మాట్లాడేవాళ్ళం!" అన్నాడు మహేశ్ సంతృప్తితో కూడిన చిరునవ్వుతో.

"నువ్వు పదేళ్ళ నుంచి అమెరికాలో వుండి చాలా మారిపోయావురా. మనం విద్యార్థులుగా వున్నప్పటికీ ఇప్పటికీ కాలం మారిందిరా మహేశ్! ఎవర్ని ఎక్కడ వుంచాలో అక్కడే వుంచి మాట్లాడాలిరా. ఎప్పుడూ తొక్కిపెట్టాలి. అప్పుడే వింటారు మన మాట. లేకపోతే నెత్తి మీదికెక్కి కూర్చుంటారు. పనికి ఒంగరు. కాని పైసలు మాత్రం కావాలె. నువ్వు నాల్గురోజుల కోసం వస్తావు. ఇక్కడి మనుషుల తీరు నీకర్థం కాదురా. వాళ్ళు పేర్లు మార్చుకుంటున్నారుగాని వాళ్ళ తక్కువబుద్ధి ఎక్కడికీ పోదు..." అమర్ చెప్తూ పోతున్నాడు.

"సరే ! అమర్ పోదామా? పదకొండయింది" అని మహేశ్ అమర్‌ను మధ్యలో ఆపాడు.

"రిజిస్ట్రేషనాఫీసు తెరిచి వుంటారు" అన్నాడు మహేశ్ తన రిస్టువాచి వైపు చూసుకొని.

మహేశ్ ఎప్పుడైనా భార్యాపిల్లలతో ఇండియాకు వస్తే వుండడానికని బేగంపేట విమానాశ్రయానికి దగ్గరగా ఒక అపార్టుమెంటు కొన్నాడు. అమర్ మధ్యవర్తిగా వుండి ఆ అపార్టుమెంటు కొనుగోలు విషయం చూశాడు. మహేశ్‌కూ, అమర్‌కూ విద్యార్థి కాలం నుంచి స్నేహం. మహేశ్ అమెరికా పోయి పదేళ్ళయినా వాళ్ళ స్నేహంలో ఏం మార్పు రాలేదు. పైగా అమర్ మహేశ్‌కు ఇంకా సన్నిహితుడయ్యాడు. మహేశ్ బ్యాంకు అకౌంటు ఇంకా ఇండియాలో ఎన్.ఆర్.ఐ.గా అతని పెట్టుబడులను గురించి అమర్ చూసుకుంటు న్నాడు. దానికోసం మహేశ్ అమర్‌కు అప్పుడప్పుడు తగినంత డబ్బు ముట్టజెప్తున్నాడు కూడా.

"ఇదంతా ఎందుకురా. నేను నీ స్నేహితుణ్ణి. పరాయివాడినా. నాకెందుకురా డబ్బు చెల్లించడం" అని అమర్ మొహమాటం పడ్డట్లుగా బాధపడ్డాడు. బేగంపేటలో కొన్న అపార్టుమెంటులో మహేశ్ వచ్చేసరికి అమర్ అల్మారాలు, షోకేసులు, బుక్‌షెల్ఫ్‌లు చేయించాడు. ఫర్నిచరు కొని అలంకరించాడు. వాటన్నిటితో కలిపి అపార్టుమెంటు ముప్ఫై లక్షల వరకయింది. దాని రిజిస్ట్రేషను వుందీరోజు. మహేశ్ అమెరికా నుంచి వచ్చి ఆ అపార్టుమెంటులోనే వున్నాడు. కారు కొనుక్కొని రాజును డ్రైవరుగా పెట్టుకొన్నాడు. అపార్టు మెంటులో ఎవరి దగ్గరో పనిచేసే డ్రైవరే రాజును తెచ్చి కుదిర్చాడు. "మంచివాడే. బాగానే జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నాడు" అనుకున్నాడు మహేశ్ రాజు వైపు చూస్తూ.

"రాజూ! కారు తుడిచావా? రెడీనా?" అడిగాడు మహేశ్.

రాజు తెల్లని క్యాప్‌ను చేతిలో పట్టుకొని వినయంగా చేతులు ఛాతీమీద కట్టుకొని కొద్దిగా ఒంగి నిల్చున్నాడు.

"తుడిచాను సార్" అన్నాడు.

"అమర్ ! పోదామా?" మహేశ్ అమర్‌వైపు చూశాడు.

రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇంతకుముందే అమర్ కావల్సిన కాగితాలను తయారు చేయిం చాడు. సంతకాలు మాత్రమే పెట్టడముంది. సమయానికి బిల్డరు వచ్చాడు. వెంటనే సంతకాల య్యాయి. రిజిస్ట్రేషనయిపోయింది. అయిపోగానే మహేశ్ కారువైపు గబగబ నడిచాడు. అతడీ రోజు సాయంత్రమే అమెరికా వెళ్ళిపోతున్నాడు. ఇంకా కాస్త షాపింగు మిగిలిపోయింది. అమర్ బిల్డరుతో మాట్లాడుతూ అతని కారుదాకా వెళ్ళాడు. వెంటనే వెనుకకు తిరిగి పరుగు నడకతో మహేశ్ దగ్గరికి వచ్చాడు.

"మహేష్ ! ఆఫీసులో వాళ్ళకు డబ్బులియ్యాలి. లేకపోతే సంతకాలైన కాగితాలను ఏదో వంకతో ఇవ్వకుండా ఆపేస్తారు. ఇది మామూలే. ఇది ఇండియా! మరచిపోకు" పళ్ళు ఇకిలించాడు అమర్

"ఓకే ! ఆల్‌రైట్ ! ఎంత?" అడిగాడు మహేశ్.

అమర్ చెప్పాడు. మహేశ్ డబ్బును పర్సులోంచి తీసి అమర్ కిచ్చాడు.

"మహేశ్...!" నసిగాడు అమర్.

"ఇంకా ఏమిటి" ప్రశ్నార్థకంగా చూశాడు మహేశ్.

"ఏం లేదు... అదే బిల్డరు... తనకు యీ అపార్టుమెంటు నిర్మాణంలో అంతా నష్టమే వచ్చిందంటున్నాడు. ఆ ఏరియాలో కన్‌స్ట్రక్షన్ పర్మిషనుకే బోలెడు డబ్బు పోయాల్సి వచ్చిందట... అందరి దగ్గర తీసుకుంటున్నానంటున్నాడు..." అమర్ ఆగుతూ ఆగుతూ మహేశ్‌తో చెప్పాడు.

మహేశ్ కాస్సేపు నిశ్శబ్దంగా వుండిపోయాడు.

"ఆ.... బిల్డరు ఏదో ఆశపడుతున్నాడు" అన్నాడు అమర్.

"ఒకే... ఎంతట?" అడిగాడు మహేశ్. అతని గొంతు బిగుసుకుపోయి వుంది.

"ఎంతో అంత ఇచ్చెయ్యి... ఓ లక్ష..."

"అంతనా!" ఆశ్చర్యపోయాడు మహేశ్.

"ఒరే! డాలర్లు సంపాయిస్తున్నావు. లక్ష ఓ లెక్కారా..." నవ్వాడు అమర్.

"ఒకే! నువ్వంటున్నావు గద యిస్తాను. ఆ రిజిస్ట్రేషన్ కాగితాలు రేపు తీసుకొని నీ దగ్గర జాగ్రత్తగా పెట్టు" అన్నాడు మహేశ్. వెంట వున్న అటాచీ తెరిచి మహేశ్ నోట్లకట్టను అమర్ చేతికిచ్చాడు.

మహేశ్ ఇచ్చిన డబ్బు తీసుకొని అమర్ గబగబ బిల్డరు కారు దగ్గరికి వెళ్ళాడు. డబ్బు అతని చేతిలో పెట్టాడు.

"ఇదిగో మీరడిగింది యాభైవేలే గద" అంటూ మిగిలిన యాభైవేలు తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు.

"అమర్ సాబ్! ఇంతవరకు ఐదు లక్షల వరకు దక్కిందనుకుంట మీకు. ఈ యాభైవేలు దానికి వడ్డీయా!" నవ్వాడు బిల్డరు.

"గట్టిగా మాట్లాడకు. నీ పనయింది గద! ఇకపో!" అని అమర్ గబగబ నడుస్తూ వచ్చి మహేశ్ పక్కన కారులో కూర్చున్నాడు.

"అంతా అయిపోయిందిరా. అపార్టుమెంటు నీ స్వంతం. ఇప్పట్నుంచి ఫ్యామిలీతో ఇండియా వచ్చి నీ ఇంట్లో నువ్వు వుండొచ్చు ఇక. హోటల్లో వుండే కర్మలేదిక నీకు" అన్నాడు అమర్.

"నా దేశంలో నాది అని చెప్పుకునే ఇంత చోటున్నదని సంతోషంగా వుందిరా అమర్ నాకు. నువ్వు సాయం చేశావు కాబట్టి ఓ మంచి అపార్టుమెంటు కొనుక్కోగలిగాన్నేను. మా పిల్లలకు బొత్తిగా ఇండియా అంటే ఏమిటో తెలియకుండా అయిపోతున్నది. ఇప్పుడిక సెలవుల్లో ఇక్కడికి వచ్చి వుండొచ్చు" మహేశ్ ముఖం మీద సంతృప్తి అలుముకుంది.

"రాజూ! కారు మా యింటికి పోనీ" అని మహేశ్ వైపు చూసి "మహేశ్! నీ ఫ్లైటు కింకా టైముందిగదరా. ఇక్కడే మా యింట్లో భోంచేసి వెళ్దువుగాని. మా ఆవిడ నిన్ను తీసుకురమ్మని చెప్పింది" అన్నాడు.

కారు వేగంగా పోయి అమర్ ఇంటి ముందు ఆగింది. రాజు తొందరగా డ్రైవింగు సీటులో నుంచి దిగి వెనుక డోరు తీశాడు. అమర్, మహేశ్‌లు దిగారు. ఇంట్లోకి నడిచారు. వెనుక నుంచి డ్రైవర్ "సార్!" అని పిలిచాడు. ఇద్దరూ వెనుకకు తిరిగారు.

"సార్! పెట్రోలయిపోయింది కారులో. పోయించాలి" అన్నాడు రాజు రెండు చేతులు గుండెల మీద మడచిపెట్టి వినయంగా.

మహేశ్ ఏం సమాధానమీయకముందే అమర్ అందుకున్నాడు. "ఏందిరా! ఎప్పుడు చూసినా పెట్రోలంటావు. నిన్న అన్ని లీటర్లు పోయించాం. అప్పుడే అయిపోయిందా? చూడు మహేశ్! వీడు ఏదో పెట్రోలు కాజేస్తున్నాడని నా అనుమానం" పెద్దగా అరిచాడు అమర్.

"హౌ క్యాన్ హీ!" తెల్లబోయాడు మహేశ్.

"ఆ ట్రిక్కులన్నీ తెల్సురా వీళ్ళకు. వీళ్ళ సంగతి నీకర్థంకాదు. నాకు తెల్సు వీళ్ళ సంగతేమిటో. పైపు పెట్టి పెట్రోలు లాగేస్తారు. అమ్ముకుంటారు. ఏయ్! అంతేనారా? చెప్పు?" మళ్ళా అరిచాడు అమర్ రాజు వైపు కోపంగా చూస్తూ.

రాజు కళ్ళలో నీళ్ళు నిండాయి.

"సార్ ! నాకదేది ఎరుకలేదు. సార్ ! నన్ను నమ్ముండ్రి. కారు డ్రైవింగు కొత్తగ నేర్చుకున్న. కారు డ్రైవింగు తప్ప నాకేం ఎరుకలేదు సార్ ! పెట్రోలు నేనెందుకు తీస్త సార్ ! నేను తియ్యలేదు సార్ ! మా అమ్మ మీద ఒట్టు!" ఏడుపు గొంతుతో రాజు కుడి చేయి అరచేతిని తల మీద పెట్టుకున్నాడు.

"అమర్ ! వాడు అట్లాంటివాడు కాదేమోరా! పోనీ" అని మహేశ్ పర్సులో నుంచి డబ్బు తీసి రాజుకిచ్చాడు.

"పో! పెట్రోలు పోయించుకొని రా పో. తొందరగా రా. నేను అపార్టుమెంటుకు పోవాలి. అక్కడ్నుంచి పెట్టెలు తీసుకొని ఎయిర్‌పోర్టుకు పోవాలి" అన్నాడు. రాజు డబ్బు తీసుకొని కారుతో వెళ్ళిపోయాడు.

"వాళ్ళు రోగ్స్‌రా! వాళ్ళను నమ్మకూడదు. ఎప్పుడూ నిఘా పెట్టి వుండాలి. లేకపోతే ఇట్లాగే మోసం చేస్తారు" అన్నాడు అమర్.

"సరేరా!" మృదువుగా నవ్వాడు మహేశ్ అర్థమైందన్నట్లుగా.

అమర్ మహేశ్‌లు మాట్లాడుకుంటుండగానే డ్రైవర్ రాజు వచ్చాడు.

"సార్ ! పెట్రోలు పోయించుకొచ్చిన" అని రాజు చిల్లర డబ్బును మహేశ్‌కు యిచ్చాడు.

"వుంచుకో" అన్నాడు మహేశ్.

"వద్దు సార్ ! ఇగో తాళపు చేతులు. నేను మానుకుంటున్నానయ్యా ఈరోజుతో. మీరు సరే అంటే మిమ్మల్ని ఎయిర్‌పోర్టులో దించుతాను" అన్నాడు రాజు తలదించుకొని. అతడు కళ్ళెత్తి మాట్లాడగా ఇంతవరకు చూడలేదు మహేశ్.

"ఏం ఏమైంది రాజూ!" అడిగాడు మహేశ్. అమర్ లోపల నుండి డిన్నరు ఏర్పాటు చూస్తున్నట్లున్నాడు. బయటికి వచ్చాడు.

"ఏమైందిరా! రాజు! దొంగతనం చేసి పైగా యీ పోజులెందుకు. మీ కొంచెపు బుద్ధులు ఎక్కడికి పోతవి. ఖతర్నాకు మనుషులు మీరు! నమ్మడానికి వీల్లేదు" పెద్దగా అరిచాడు అమర్.

"నేను దొంగతనం చెయ్యలేదు సార్! కష్టం చేసుకొని బతికెటోళ్ళం. మాకు లక్షల కోట్ల మీద ఆశల్లేవు సార్. మాకు ఊర్లె ఒక ఎకరం పొలం, రెండెకరాల చెలక వుండె సార్! వానలు పడక కరువుకాలం వచ్చింది. ఏడేండ్లు వరుసగా వానల్లేవు మా ఊర్లె. గప్పుడె మా నాయన పొట్ట చేత పట్టుకొని బతికేనీకె పట్నం వచ్చిండు సార్! మా కష్టం మేం జేసుక బతికెటోల్లం సార్! మా నాయన గిక్కడికి పట్నం వచ్చి కూలిపనులు చేసెటోడు. మా అమ్మ గిప్పటికి ఇండ్లల్ల పని జేస్తది సార్! పరువుతోటి బతికినోల్లమే మేం. పట్నం వచ్చి గిట్ల బజార్లపడిపోయినం. ఊరుపేరు లేనోల్ల లెక్క బద్నాం పాలయిపోతున్నం. గా పరువు నిలిస్తె చాలు మాకు. గిన్ని అన్నం మెతుకులు దొరికితె చాలు మాకు. నిజాయితీగా వుండడమే ఎరుక మాకు సార్!" ముఖం నేలకు దించుకునే అన్నాడు రాజు. అతని తెల్లని ప్యాంటు, షర్టు ట్యూబులైటు వెలుగులో తెల్లగా మెరిశాయి. అట్లా నిలబడి వున్న రాజువైపు మహేశ్ కనురెప్ప వేయకుండా చూశాడు.

"వీళ్ళతో బతకలేం రోగ్స్" కోపంగా అన్నాడు అమర్. లోపలికి వెళ్ళిపోయాడు డిన్నరు రెడీ అయిందా చూడడానికి.

"రాజూ ! నువ్వు వెళ్ళిపోవద్దు. నన్ను ఎయిర్‌పోర్టులో దింపేసిం తర్వాత కారును అపార్టుమెంటుకు తీసుకుపోయి పార్కింగు ప్లేసులో పెట్టు. నేను మళ్ళా వచ్చేంతవరకు అపార్టుమెంటును, కారును చూసుకుంటూ వుండు. నేను అమెరికా నుంచి నెలనెలా జీతం పంపిస్తాను. ఓకే!" అన్నాడు మహేశ్ చిరునవ్వుతో.

రాజు ముఖం పైకెత్తి మహేశ్ వైపు చూశాడు. కళ్ళల్లో కళ్ళుపెట్టి చూశాడు. మహేశ్ కళ్ళల్లో స్నేహం కన్పించింది రాజుకు. రాజు కళ్ళల్లో మహేశ్ పట్ల కృతజ్ఞత ఉప్పొంగుతూ కన్పించింది. రాజు గుండె సంతోషంతో ఉప్పొంగింది. ఆత్మ విశ్వాసంతో నిటారుగా నిల బడ్డాడు. రెండు చేతులు జోడించాడు.

"థాంక్యూ సార్! థ్యాంక్యూ వెరీమచ్" అన్నాడు. అతని తెల్లని పలువరస నల్లని ముఖంలో తళతళ మెరిసింది.

– ప్రజాశక్తి, 15 ఏప్రిల్, 2001